PRGI No. APTEL/2022/81596)

janodaya

జనోదయ

JANODAYA

కరీంనగర్ గురువారం 20.08.2026 : సంపుటి : 03 : సంచిక : 51 : పేజీలు : 04 వెల : రూ.5

Karimnagar Thursday 20.08.2026 : Volume: 03: Issue 51 : Pages 04 : Cost 5/

తెలుగు దినపత్రిక

## సుతార్ స్పిన్‌కు చిక్కిన శ్రీలంక

**165 రన్స్ తేడాతో భారత్ విజయం**



**గాలే:** శ్రీలంకతో జరిగిన తొలి టెస్టు టీమిండియా విక్టరీ కొట్టింది. చరిత్రాత్మకమైన 600వ టెస్టులో 165 పరుగుల తేడాతో గిల్ సేన విజయాన్ని సాధించింది. భారత స్పిన్నర్ మానవ్ సుతార్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసి లంకను దెబ్బతీశాడు. 372 రన్స్ టార్గెట్‌తో చేజింగ్ మొదలుపెట్టిన శ్రీలంక తన రెండో ఇన్నిం గ్స్‌లో 206 రన్స్‌కే ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్ దేవదత్ పడిక్కల్ తొలి ఇన్నింగ్స్‌లో 167 రన్స్ చేయగా, ఇక బౌలర్ సుతార్ రెండు ఇన్నింగ్స్‌లో కలిపి పది వికెట్లను తన ఖాతా లో వేసుకున్నాడు. తాజా విక్టరీతో రెండు టెస్టుల సిరీస్‌లో ఇండి యా 1-0 ఆధిక్యాన్ని సాధించింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన లంక బ్యాటర్ దినుషా.. రెండో ఇన్నింగ్స్‌లో 84 రన్స్ చేసి ఔటయ్యాడు.

# కొండా తిరుగుబాటు

# రేవంత్‌రెడ్డీ.. కండ్లు నెత్తికెక్కినయా?

ముఖ్యమంత్రి నువ్వా, పొంగులేటా?

ఆ ‘పొంగు’ ఎక్కువసేపు పొంగదు

వేం నరేందర్‌డ్డి నీకు ఇస్తున్న సలహాలతోనే రాష్ట్రం ఆగమైతున్నది

అచ్చ కాంగ్రెస్ వర్సెస్ పచ్చ కాంగ్రెస్ అన్నట్టుగా ఉన్నది రాష్ట్రంలో పరిస్థితి

**నువ్వు సీల్డ్ కవర్ సీఎం అని గుర్తు పెట్టుకో**

**రేవంత్ అవినీతి గుట్టు రట్టు చేస్తా!**

**మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత ఘాటు హెచ్చరిక**

**రేవంత్‌రెడ్డీ.. ముందు నువ్వు ముఖ్యమంత్రిగా ఉంటవో, ఉండవో చూస్కో**





4లో..

## మంత్రి కొండా సురేఖకు నోటీసులు

**కూతురు సుస్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్**

**సీఎం, ఎమ్మెల్యేపై సుస్మిత చేసిన వాఖ్యలపై ఆగ్రహం**

**కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చిన్నారెడ్డికీ నోటీసులు**

**కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి వెల్లడి**



**హైదరాబాద్, ఆగస్టు 20 :** సీఎం రేవంత్‌రెడ్డిపై, పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిపై కొండా మురళి, సురేఖ దంపతుల కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ విషయంపై మంత్రి కొండా సురేఖ నుంచి వివరణ కోరుతూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ బుధవారం షో కాజ్ నోటీసులు జారీ చేసింది. దీనిపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరా తీశారని, పూర్తి నివేదిక ఇవ్వాలని టీపీసీసీని ఆదేశించినట్టు సమాచారం. సుస్మితా పటేల్ వ్యాఖ్యలను తీ వ్రంగా పరిగణించి, ఖండిస్తున్నట్టు పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి ఢిల్లీలో మాట్లా డుతూ తెలిపారు. సీఎం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉ న్నాయని పేర్కొన్నారు. పూర్తి సమాచారాన్ని తెప్పించుకొన్న తర్వాత సుస్మితపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఇటీవల సీనియర్ నేతలు కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చిన్నారెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఇప్పటికే వారికి నోటీసులిచ్చి, వివరణ కోరినట్టు మల్లు రవి తెలిపారు.

## 20శాతం సంక్షేమానికే

**సినిమా టికెట్ ధరల పెంపు కలెక్షన్‌లపై సర్కార్ కీలక నిర్ణయం**



**హైదరాబాద్ :** సినిమా టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చిన కలెక్షన్‌లో 20శాతం సంక్షేమం కోసం తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్ది, రాజాసాబ్, మనశంకర వరప్రసాద్ గారు, అఖండ 2 సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20శాతం తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్, టీజీ ఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించింది. ఆ మొత్తాన్ని ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని నిర్మాతలకు సూచించింది. ఇటీవల విడుదలైన, త్వరలో రాబోతున్న భారీ చిత్రాలకు ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## విద్యకు తొలి ప్రాధాన్యత



**మంత్రి వివేక్ వెంకటస్వామి చెన్నూరు నియోజకవర్గంలో బుధవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో విద్యకు మొట్టమొదటి ప్రాధాన్యత ఇచ్చే కార్యక్ర మాన్ని చేపట్టామని తెలిపారు. విద్యా రంగం అభి వృద్ధికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకా రాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుం టామని హామీ ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లోని వి ద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయా లన్నదే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.**

3లో..

**ఏపీ మండలి డిప్యూటీ ఛైర్మన్‌గా**

## వైసీపీ ఎమ్మెల్సీ ఏకగ్రీవ ఎన్నిక



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ మండలి డిప్యూటీ చైర్మన్‌గా వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలిలో టీడీపీ, బీజేపీ, జనసేన సభ్యుల కంటే వైసీపీ సభ్యు లు మెజార్టీ సంఖ్యలో ఉండడంతో కూటమి తరుఫున ఎవరూ నామి నేషన్ దాఖలు చేయలేదు. దీంతో బుధవారం మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు మండలి చైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. అనంతరం మాధవరావును చైర్మన్ స్థానంలో కూర్చోబెట్టి అభినందించారు. ఈ కార్య క్రమానికి కూటమి సభ్యులు చైర్మన్ సీటు వద్దకు రాకపోవడంతో మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. కూటమి సభ్యులు సభా సంప్రదాయాలను పాటించడం లేదని ఆరోపించారు. చైర్ పట్ల అగౌరవంగా వ్యవహరించడం మంచిది కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓట ములు సహజమని, సభా సాంప్రదాయాలు, గౌరవాలు శాశ్వతం అని అన్నారు.

## వీడిన ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసు మిస్టరీ

**పది విద్యార్థులే హంతకులు**

**నిర్ధారించిన పోలీసులు**



**నల్లగొండ :** ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసు మిస్టరీ వీడింది. ఆమెను హత్య చేసింది ఆమె స్కూల్‌లో చదివే పదో తరగతి విద్యార్థులేనని పోలీ సులు దర్యాప్తులో తేలింది. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి ఈ నెల 11న సాయంత్రం హత్యకు గురయ్యారు. నిందితులు సీసీ కెమెరాలకు చిక్కకుండా, పక్కా ప్లాన్‌తో చేసిన ఈ హత్య కేసును చేధించడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఆఖరికి ఆమె స్కూల్‌లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులే ఈ ఘాతుకానికి ఒడిగ ట్టారని తేలింది. నిందితులు గంజాయికి అలవాటు పడ్డారని, విచ్చలవిడిగా జల్సాలకు చేస్తున్నారని, ఈ క్రమంలోనే డబ్బుల కోసం రూపారెడ్డిని హత్య చేశారని పోలీసులు నిర్ధారించారు. హత్యకు పాల్పడిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులను అరెస్ట్ చేశారు. పోలీసులు వెల్లడించిన కథనం ప్రకారం.. ఈ నెల 11న సాయంత్రం ప్రిన్సిపల్ రూపారెడ్డి స్కూల్ ముగించుకొని ఇంటికి రావడానికి ముందే నిందితులు వెను కవైపు నుంచి గోడదూకి ఇంట్లో చొరబ డ్డారు.ఆమె ఇంటి తాళంతీసి లోపలికి వెళ్లిన సమయంలో ఆమె వాష్‌రూమ్‌లోకి వెళ్లగానే నిందితులు వంటగదిలోకి వెళ్లి దాక్కున్నారు. ఆమె ఫ్రెష్ అయ్యి బెడ్‌రూమ్‌లోకి వెళ్లగానే వెనుక నుంచి వెళ్లి కత్తులతో పొడిచారు. మొత్తం 27 సార్లు ఆమెను విచక్షణారహితంగా పొడిచారు. ఆ తర్వాత ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న రూ.2 లక్షల డబ్బును తీసుకుని పారిపోయారు. ఆ డబ్బుతో హైదరా బాద్‌కు వెళ్లి జల్సాలు చేశారు. చివరికి పోలీసులకు చిక్కారు.

# శ్రీరామ్ నగర్‌లో అక్రమ జి ప్లస్ 6 నిర్మాణం

**-సెట్‌బ్యాక్‌లు లేకుండా బిల్డర్ చక్రపాణి నిర్మిస్తున్న నిర్మాణం**

**-టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**

**జనోదయ : శేరిలింగంపల్లి : ఆగస్టు 19 :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ ఏ బ్లాక్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఉన్న భవనంపై టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. శ్రీరామ్‌నగర్ ఇంటి నంబర్ 1/57/65/ఏ చిరునామాలో బిల్డర్ చక్రపాణి నిర్మిస్తున్నట్లు పేర్కొంటున్న ఈ భవనం సుమారు 100 గజాల స్థలంలో జిప్లస్ 6 అంతస్తులుగా కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భవన నిర్మాణానికి సంబంధించి నిబంధనల ప్రకారం అవసరమైన సెట్‌బ్యాక్‌లు పాటించడం లేదని, దీంతో భవిష్యత్తులో స్థానికులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న విస్తీర్ణంలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో భవనానికి అనుమతులు ఉన్నాయా? అనుమతులకు అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా? అనే అంశాలపై అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలని వారు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వాటిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి, భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ప్లాన్, సెట్‌బ్యాక్‌లు తదితర అంశాలను తనిఖీ చేయాలని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే నిర్మాణ పనులను నిలిపివేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీరామ్ నగర్ ఏ బ్లాక్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ఆగస్టు 21న రాగం సుజాత యాదవ్ దశదినకర్మ

**-శోకతప్త హృదయాలతో కుటుంబ సభ్యుల ఆహ్వానం**




**జనోదయ : శేరిలింగంపల్లి, ఆగస్టు 19 :** ఇటీవల మృతి చెందిన రాగం సుజాత యాదవ్ 2026 ఆగస్టు 13 మృతిచెందిన సందర్భంగా దశదినకర్మ కార్యక్రమం ఆగస్టు 21న శుక్రవారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి నల్లగండ్లలోని వర్టెక్స్ కింగ్స్టన్ పార్క్ విల్లాస్ లోని స్వగృహం (విల్లా నెంబర్ 2 24)లో కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి బంధు మిత్రులు, అభిమానులు హాజరై సుజాత యాదవ్ కు నివాళులర్పించాలని కుటుంబ సభ్యులు కోరారు. శోకతప్త హృదయాలతో రాగం నాగేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్, శేరిలింగంపల్లి, కుమారులు రాగం అనిరుధ్ యాదవ్, రాగం జాగృతి సాయి యాదవ్, రాగం అభిషేక్ యాదవ్ తదితర కుటుంబ సభ్యులు ఆహ్వానించారు.

## డ్రగ్స్ పెడ్లర్లపై గచ్చిబౌలి పోలీసుల ఉక్కుపాదం

**రూ.16.40 లక్షల విలువైన ఎండీఎంఏ, ఓజీ కుష్ స్వాధీనం**



**జనోదయ : శేరిలింగంపల్లి ఆగస్టు 19 :**

విశ్వసనీయ సమాచారం మేరకు గచ్చిబౌలి పోలీసులు, ఎస్‌ఓటీ సైబరాబాద్ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన దాడులలో ముగ్గురు డ్రగ్స్ పెడ్లర్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.16,40,920 విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో 16 మంది డ్రగ్స్ వినియోగదారులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డులో కొరిపెల్ల యశ్వంత్ సాయి షణ్ముఖ్ (26)ను 16 మంది వినియోగదారులతో కలిసి పోలీసులు పట్టుకున్నారు. విచారణలో యశ్వంత్ కేరళకు చెందిన మహ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్ (26), బెంగళూరుకు చెందిన నవీనా కేడీ (22) నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. దీంతో ప్రత్యేక బృందాలు కేరళ, బెంగళూరుకు వెళ్లి ఆగస్టు 18న రజల్‌ను త్రిస్సూర్‌లో, నవీనాను బెంగళూరులో అరెస్ట్ చేశాయి. నవీనా నివాసంలో 51 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ లభించగా, రజల్ వద్ద నుంచి 44.41 గ్రాముల ఎండీఎంఏకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. ఈ అరెస్టులు శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సి హెచ్ శ్రీనివాస్,ఎస్‌ఓటీ సైబరాబాద్ డీసీపీ శోభన్‌కుమార్, ఎస్‌ఓటీ అదనపు డీసీపీ-1 టి. గోవర్ధన్, శేరిలింగంపల్లి జోన్ అదనపు డీసీపీ ఉదయ్ రెడ్డి, నార్సింగి డివిజన్ ఏసీపీ జి. వెంకట రమణ గౌడ్ పర్యవేక్షణలో జరిగాయి. ఎస్‌ఓటీ సైబరాబాద్ బృందాలు, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, డీఐతో పాటు పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. డ్రగ్స్, గంజాయి సరఫరాకు సంబంధించిన సమాచారం ఉంటే డయల్-100 లేదా సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 8712663061కు తెలియజేయాలని పోలీసులు ప్రజలను కోరారు. సమాచార దాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

## 'శ్రీనివాసుడు' చుట్టూ తిరుగుతున్న
# టౌన్ ప్లానింగ్ వ్యవహారాలు?

**మూడు సర్కిళ్లలో 'శ్రీనివాసుడు' హవా**

**అధికారులపై ప్రశ్నల వర్షం**

**అక్రమ నిర్మాణాల వెనుక దళారీ వ్యవస్థా?**

**చర్యలకు ఎందుకు వెనకడుగు?**

**జనోదయ : శేరిలింగంపల్లి ఆగస్టు 19 :**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలోని మాదాపూర్, శేరిలింగంపల్లి, మియాపూర్ సర్కిళ్లలో అక్రమ నిర్మాణాలు, అనుమతుల ఉల్లంఘనలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ మూడు సర్కిళ్లలో ఒక కాంట్రాక్టు ఉద్యోగి అయిన "శ్రీనివాసుడు" ప్రభావం అధికంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకులు, బిల్డర్లు, మున్సిపల్ అధికారుల మధ్య వారధిగా, దళారిగా వ్యవహరిస్తున్నాడని స్థానికంగా చర్చ జరుగుతోంది. బిల్డర్లకు అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాల విషయంలో అతని ప్రమేయం లేకుండా ఫైళ్లు ముందుకు కదలవని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మాదాపూర్ సర్కిల్‌లోని అయ్యప్ప సొసైటీ పరిధిలో అనేక నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అంతా "శ్రీనివాసుడే చూసుకుంటాడు" అని బహిరంగంగా చెప్పుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రజావాణి కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి అత్యధికంగా అక్రమ నిర్మాణాలపైనే ఫిర్యాదులు వస్తున్నప్పటికీ, వార్తాపత్రికల్లో పుంఖాను, పుంకాలుగా ,కథనాలు వస్తున్నప్పటికీ ,సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. గతంలో శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ రైడ్స్ జరిగినా అధికారుల తీరు మారటం లేదు. ఒక కాంట్రాక్టు ఉద్యోగి ఇంత ప్రభావం చూపడం వెనుక ఉన్న "అదృశ్యవ్యక్తి" ఎవరు? అతనిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? అధికారులు మౌనం ఎందుకు పాటిస్తున్నారు? అనే ప్రశ్నలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ



జరిపి వాస్తవాలను వెలికి తీయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరల ఒక సారి శేరిలింగంపల్లి జోన్ సర్కిల్స్ ,టౌన్ ప్లా నింగ్ విభాగాల మీద ఏసీబీ దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు. విచిత్రం ఏమిటంటే ఎప్పుడైనా ట్రాన్స్ఫర్ చేస్తే రోజులు వ్యవధిలోనే గోడకు కొట్టిన బంతి లాగా అదే ప్లేస్‌కి వస్తాడు. ఒకవేళ విమర్శలకు తలొగ్గి పక్క డిపార్ట్మెంట్లో అడ్జస్ట్మెంట్ చేసిన టౌన్ విభాగంలోనే పనిచేస్తూ ఉంటాడు .

# రూ.1 కోటి సైబర్ మోసం

**●సొమ్ము 10 రోజుల్లో రికవరీ**

**●నకిలీ వాట్సాప్ ఖాతాతో యజమాని పేరుతో మోసం..నిందితుడు అరెస్ట్**

**జనోదయ : శేరిలింగంపల్లి ఆగస్టు 19 :** నకిలీ వాట్సాప్ ఖాతా సృష్టించి యజమాని పేరుతో రూ.1 కోటి సైబర్ మోసానికి పాల్పడిన కేసులో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన దీపక్ కుమార్ (37)ను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆగస్టు 4న ఓ చీరల రిటైల్ సంస్థ అకౌంటెంట్‌కు యజమాని పేరుతో నకిలీ వాట్సాప్ సందేశం వచ్చింది. దానిని నిజమని నమ్మిన అకౌంటెంట్ కరూర్ వైశ్య బ్యాంకు ఖాతా నుంచి రూ.1 కోటిని ఇండస్ ఇండ్ బ్యాంకు ఖాతాకు బదిలీ చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నగదు రోవల్ మోడా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉన్న సంస్థ ప్రస్తుత ఖాతా ద్వారా మళ్లించినట్లు గుర్తించారు. ఈ నెల 8న లక్నోలో దీపక్ కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం కూకట్‌పల్లి తొమ్మిదో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలతో న్యాయ రిమాండ్‌కు తరలించారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మార్గదర్శకత్వంలో, కూకట్ పల్లిలోని రంగారెడ్డి జిల్లా మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తొమ్మిదో అదనపు ప్రథమ శ్రేణి న్యాయ




మేజిస్ట్రేట్ ఇచ్చిన తక్షణ ఆదేశాల మేరకు ఆగస్టు 14న బాధితుడికి మొత్తం రూ.1 కోటి సొమ్మును తిరిగి అందజేశారు. దీంతో కేవలం పది రోజులలోనే మోసపోయిన మొత్తం సొమ్ము బాధితుడికి రికవరీ కావడం విశేషం. జాతీయ సైబర్ నేరాల నివేదికల పోర్టల్ విశ్లేషణలో నిందితుడి బ్యాంకు ఖాతాకు ఇతర రాష్ట్రాలలో నమోదైన సైబర్ నేరాలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో మిగిలిన నిందితులు, పూర్తి నగదు లావాదేవీల మార్గంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ ఏ. మన్మోహన్, ఎస్ఐ శ్రీనివాసులు తమ బృందంతో దర్యాప్తు చేశారు. సైబర్ క్రైమ్స్ డీసీపీ కె.పుష్ప మార్గదర్శకత్వంలో, సైబర్ క్రైమ్స్ ఏసీపీ ఏ. రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు చర్యలు చేపట్టారు. వాట్సాప్ ఖాతా ఫొటో, పేరు చూసి మాత్రమే



వ్యక్తిని నమ్మి ఆర్థిక లావాదేవీలు చేయవద్దని పోలీసులు సూచించారు. నగదు బదిలీకి ముందు సంబంధిత వ్యక్తిని ఇతర మార్గాలలో స్వతంత్రంగా ధృవీకరించుకోవాలని తెలిపారు. తెలియని మూలాల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లు, అనుమానాస్పద యాప్‌లను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి, జాతీయ సైబర్ నేరాల నివేదికల పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## మియాపూర్‌లో ట్రాఫిక్‌కు
# విజేత సూపర్ మార్కెట్ అడ్డంకి

**-గురునాథం చెరువు కట్ట రోడ్డుపై వాహనదారుల ఇబ్బందులు**

**-చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి**



**జనోదయ : శేరిలింగంపల్లి ,ఆగస్టు 19 :** జయప్రకాష్ నారాయణ్ నగర్ నుంచి మియాపూర్‌కు వెళ్లే గురునాథం చెరువు కట్ట రోడ్డుపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పరిసర ప్రాంతాల కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మియాపూర్ చెరువు కట్ట మీదుగా ప్రతిరోజూ పలు కాలనీలకు చెందిన ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, కార్లలో ప్రయాణించే వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డుపై ఉన్న విజేత సూపర్ మార్కెట్ వద్ద డెలివరీ వాహనాల లోడింగ్, అన్‌లోడింగ్ కారణంగా రహదారి ఇరుకుగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా ఆన్‌లైన్ షాపింగ్ డెలివరీ బైక్‌లు రోడ్డుపైనే నిలిపివేయడం, సరుకుల ఎక్కింపు, దింపే సమయంలో వాహనాలను అడ్డంగా నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం పాఠశాలలు, కార్యాలయాలు ప్రారంభమయ్యే సమయంలో, సాయంత్రం పాఠశాలలు, కార్యాలయాలు ముగిసే వేళల్లో రద్దీ మరింత పెరిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యవసర వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు, మియాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, రోడ్డుపై వాహనాల పార్కింగ్, లోడింగ్, అన్‌లోడింగ్‌ను క్రమబద్ధీకరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకుని వాహనదారులకు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.







# చెన్నూరు యువతకు ఉద్యోగాలే లక్ష్యం

### అవకాశాలను అందిపుచ్చుకోవాలి

### మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ

**జనోదయ : చెన్నూరు ఆర్సీ**

చెన్నూరు యువత ప్రభుత్వ ఉద్యోగాల్లో పెద్ద సంఖ్యలో ఎంపికై రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పిలుపునిచ్చారు. కాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం చెన్నూరు పట్టణంలో ఏర్పాటు చేసిన కాకా ఫ్రీ కోచింగ్ సెంటర్ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న యువతకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకూడదనే లక్ష్యంతో కాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం, ఫౌండేషన్ అందిస్తున్న ఈ అవకాశాన్ని యువత పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. చెన్నూరు ప్రాంతం నుంచి అత్యధిక సంఖ్యలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు ఎంపికై రాష్ట్రస్థాయిలో చెన్నూరుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చదువే యువత భవిష్యత్తుకు బలమైన పునాది. కష్టపడి చదివి ఉద్యోగం సాధించండి.. మీ కుటుంబానికి, మీ ప్రాంతానికి గర్వకారణంగా నిలవండి" అని మంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.





**కేసులు కాదు.. ఉద్యోగాలు కావాలి : ఎంపీ వంశీకృష్ణ**

ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ నీళ్లు నిధులు, నియామకాలు అనే నినాదంతో సాధించుకున్న తెలంగాణలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. యువతను రాజకీయంగా రెచ్చగొట్టడం కాకుండా వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగ యువత విదేశీ భాషలు నేర్చుకుని అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు పొందడాన్ని తప్పుబట్టడం సరికాదన్నారు. యువతకు కేసులు కా వాలా.. ఉద్యోగాలు కావాల ఒక్క సారి ఆలోచించాలి అని ఎంపీ వంశీ కృష్ణ సూచించారు. కేటీఆర్ ఒక్కరే అమెరికా వెళ్లాలా తెలంగాణ యువత విదేశాల్లో ఉద్యోగాలు చేయకూడదా? అని ప్రశ్నించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవతో టామ్‌కామ్ ద్వారా తెలంగాణ నిరుద్యోగ యువతకు విదేశాల్లోనూ ఉద్యోగ, ఉపాధి అవకా శాలు కల్పించేందుకు చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం అవకాశాలను కల్పిస్తుంది. వాటిని అందిపుచ్చుకుని జీవితాలను మార్చుకోవాల్సిన బాధ్యత యువతదే అని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు. ప్రతి యువకుడు, యువతి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి మంచి ఉద్యోగం సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, కాకా ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, యువత, పోటీ పరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

---

## మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా చెన్నూరులో మొక్కలు నాటే కార్యక్రమం



**జనోదయ : చెన్నూరు ఆర్సీ**

మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా మెగా యూత్ ఫోర్స్ మంచిర్యాల్ జిల్లా నాయకుడు సిద్దు ఆధ్వర్యంలో నేడు చెన్నూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కాసరాజు విచ్చేసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతా వరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ టీం సీనియర్ జనసేన నాయకులు రాజా రవికిరణ్, బాలు, సాయి మామిడి, రఘు, సాయి కిరణ్, పొన్నం సాయి, సాయి ఆడేటి, చెన్నూర్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అలగం సాయికుమార్, పాఠశాల విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

---

## ఉద్యోగాల బాటలో యువత

### జైలు రాజకీయాలకు దూరంగా ఉండాలి

### యువతకు ఎంపీ వంశీకృష్ణ పిలుపు

### కోటపల్లి, చెన్నూరులో అభివృద్ధి కార్యక్రమాలు

**జనోదయ : చెన్నూరు ఆర్సీ**

యువత తమ బంగారు భవిష్యత్తును రాజకీయ ప్రేరేపణలకు బలిచేయకుండా విద్య, ఉద్యోగాలు, ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. యువతకు ఉ ద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుంటే.. మరోవైపు యువతను రెచ్చగొట్టే లాగా బిఆర్ఎస్ రాజకీయ వ్యాఖ్యలు వారి భవిష్యత్తుకు నష్టం చేస్తాయని ఆయన సూచించారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ రూ.50 లక్షల నిధులతో చేపట్టిన విద్యార్థుల కనీస వసతుల అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి, ఎంపీ ఆకాంక్షించారు. అనంతరం చెన్నూరు పట్టణంలోని మహిళా భవన్‌లో కాక వెంకటస్వామి పేరు మీద ఏర్పాటు చేసిన ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు కూడా విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగాలు సాధించే స్థాయికి ఎదగాలని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల కేటీఆర్ ,హరీష్ రావు పిల్లలు అమెరికాలో చదువుకుంటే అభ్యంతరం లేని నాయకులు.. తెలంగాణ పేద కుటుంబాల పిల్లలు జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగాలు సాధిస్తే ఎందుకు ఓర్వలేకపోతున్నారో యువత ఆలోచించాలని వంశీ కృష్ణ అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత కలిగిన నాయకులు వారిని వివాదాలు, కేసుల వైపు నడిపించడం సరైన విధానం కాదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చెప్పినట్టు ఉద్యోగాలు కావాలా లేక కేటీఆర్ చెప్పినట్టు కేసులు, జైలు రాజకీయాలు కావాలా అని యువతను ఉద్దేశించి వంశీకృష్ణ ప్రశ్నించారు. రాజకీయంగా రెచ్చగొట్టే మాటలకు ఆకర్షితులై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. యువతకు ఉచిత కోచింగ్, విద్యా వసతులు, ఉద్యోగ అవకాశాల కల్పన వంటి అంశాలపై దృష్టి సారిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.



---

## జైపూర్ మండల స్థాయి సమీక్షా సమావేశంలో

# అభివృద్ధి పనులపై సమీక్ష

**జనోదయ : చెన్నూరు ఆర్సి**



జైపూర్ మండల స్పెషల్ అధికారి గూడూరి శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ శ్రీపతి బాపు రావు, తహసీల్దార్ వనజా రెడ్డితో 45 రోజులకు ఒక సారి నిర్వహించే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మండల స్థాయి సమీక్షా సమావేశంలో మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలను సమర్పించి ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల పురోగతిని, ఎదురైన సవాళ్లను, మరియు వాటిని అధిగమిం చడానికి తీసుకున్న చర్యలను కూలం కషంగా చదివి వినిపించారు. వ్యవసా యం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాలు వంటి కీలక రంగా లపై ప్రత్యేక దృష్టి సారించారు. జైపూర్ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరేలా చూడా లని, అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనం తరం ముదిగుంట గ్రామ సర్పంచ్ ఆకుల రవికుమార్ మరియు పంచాయతీ కార్యదర్శి సురేష్ ని సన్మానించారు. ఈ కా ర్యక్రమంలో కార్యాలయ సూపర్ డెంట్ జి. భాగ్యలక్ష్మి ,మండల వివిధ గ్రామల సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు,మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

---

## విద్యకు తొలి ప్రాధాన్యత

### విద్యతోనే జీవితాల్లో మార్పు

### మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ

**జనోదయ : చెన్నూరు ఆర్సీ**



మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ. 1.45 కోట్ల వ్యయంతో చేపట్టిన రెనోవేషన్ పనులు పూర్తి కావడంతో నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తును రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కళాశాలకు విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బోర్‌వెల్ ఏర్పాటు చేయించినందుకు మంత్రి వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల పరిస్థితి బాగాలేదని తెలుసుకున్న వెంటనే స్పందించిన మంత్రి, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసి కళాశాల రూపురేఖలు మార్చేందుకు సహకరించారని అన్నారు. కళాశాల అభివృద్ధికి అందించిన సహకారానికి మంత్రి,ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో విద్యకు మొట్టమొదటి ప్రాధాన్యత ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. విద్యా రంగం అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలన్నదే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ.. కాకా వెంకటస్వామి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్యతోనే మన జీవితాలను మెరుగుపరుచుకోవచ్చని, విద్యార్థులకు నాణ్యమైన విద్యా వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వ విద్యా సంస్థలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గాల్లో బరిలో ఉండే అభ్యర్థులను ఎవరికి వారే ప్రకటించుకున్న పరిస్థితి కన్పిస్తోంది. ఎన్నికలక ఇంకా రెండున్నర ఏళ్ల సమయం ఉన్నప్పటికీ అభ్యర్థుల ప్రకటన రాష్ట్ర స్థాయిలోనే ప్రకటిస్తున్న వైనం కలకలం రేపుతోంది.వాస్తవానికి ఎమ్మెల్యే అభ్యర్థుల టికెట్ల వ్యవహారం అంతా అధిష్టానం చూసుకుంటుంది. అభ్యర్థుల లిస్టులను పంపించడం మాత్రమే రాష్ట్రస్థాయిలో జరుగుతుంది.ముఖ్యమంత్రి కోటా,మంత్రుల కోటా,నేతల కోటా అంటూ కొందరు సూచించిన పేర్లు లిస్టులో ఉంటాయి.చివరికి ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన మాత్రం ఢిల్లీ స్థాయిలోనే జరుగుతుంది. కానీ విచిత్రంగా ఇంకా ఎన్నికలకు చాలా సమయం ఉండగానే అప్పుడే ఎవరికి వారే ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించుకుంటున్నారు.ఎవరికి వారే ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించుకుంటూ పోతే ఇక అధిష్టానం ఉన్నది ఎందుకు? అనే ప్రశ్న పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతోంది.గెలుపోటములు పట్టించుకోకుండా వారసత్వ రాజకీయాలను పెంచుకుంటూ పోతే పార్టీలో యువతకు అవకాశం చిక్కుతుందా అని ప్రశ్నిస్తున్నారు.ఏండ్ల తరబడి పార్టీనే నమ్ముకుని అనేక కష్టనష్టాలకు ఓర్చుకుంటూ పార్టీ జెండాలను మోస్తున్న వారికి అన్ని చోట్లా మొండిచేయే ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నియోజకవర్గాల్లో అభ్యర్థుల బలాబలాను క్షేత్రస్థాయిలో సర్వేలు చేయించి టికెట్లు కేటాయించకుండా ఎవరికి వారే అభ్యర్థులను ప్రకటించుకుంటూ పోయి వారికోసం లాబీయింగ్‌లు చేసుకుంటూపోతే ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు ఎదురవుతాయని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నారు.ఏది ఏమైనప్పటికీ కాంగ్రెస్ పార్టీలో అప్పుడే టికెట్ల గోల మొదలయిందని అంటున్నారు.

# కొండా తిరుగుబాటు

## రేవంత్‌రెడ్డీ.. కండ్లు నెత్తికెక్కినయా?

**నువ్వు సీల్డ్ కవర్ సీఎం అని గుర్తు పెట్టుకో**

**రేవంత్ అవినీతి గుట్టు రట్టు చేస్తా!**

**మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత ఘాటు హెచ్చరిక**

**రేవంత్‌రెడ్డీ.. ముందు నువ్వు ముఖ్యమంత్రిగా ఉంటవో, ఉండవో చూస్కో**

**నీ తమ్ముడి 200 కోట్ల ఇష్యూ ఒక్కటే బయటపెట్టిన! ఇంకా చాలా ఉన్నయ్**

**ఇంటెలిజెన్స్‌ను పట్టుకొని మంత్రుల ఇండ్ల సుట్టూ పోలీసుల్ని తిప్పుతవా?**

**ముఖ్యమంత్రి నువ్వా, పొంగులేటా? ఆ 'పొంగు' ఎక్కువసేపు పొంగదు**

**వేం నరేందర్‌డ్డి నీకు ఇస్తున్న సలహాలతోనే రాష్ట్రం ఆగమైతున్నది**

**అచ్చ కాంగ్రెస్ వర్సెస్ పచ్చ కాంగ్రెస్ అన్నట్టుగా ఉన్నది రాష్ట్రంలో పరిస్థితి**

**డైపర్ వేసుకోకుండా నడవలేని రేవూరికి మళ్లా టికెట్ ఇస్తానంటవా?**

**సీఎం వచ్చినా, వాళ్ల అయ్య-తాత వచ్చినా పరకాలలో గెలిచేది నేనే!**

**రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత ఫైర్.. బర్త్‌డే వేడుకల్లో సంచలన వ్యాఖ్యలు**

**వరంగల్, ఆగస్టు 19 :** 'ముఖ్యమంత్రి అయితే.. కండ్లు నెత్తికి ఎక్కినయా రేవంత్‌రెడ్డీ?' అని మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రెండున్నరేండ్లలో రేవంత్‌రెడ్డి, ఆయన తమ్ముళ్లు రాష్ట్రం మీద పడి తినడం తప్ప ప్రజలకు ఏం చేశారు?' అని నిలదీశారు. 'రాష్ట్రంలో అచ్చ కాంగ్రెస్ వర్సెస్ పచ్చ కాంగ్రెస్‌లా పరిస్థితి తయారైంది' అని నిప్పులు చెరిగారు.మంత్రి కొండా సురేఖ జన్మదినం సందర్భంగా బుధవారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఊకల్ శివారులో నిర్వహించిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో సుస్మితా పటేల్ పాల్గొన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా వచ్చే ఎన్నికల్లో పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని చేసిన వ్యాఖ్యలపై సుస్మిత మండిపడ్డారు. వృద్ధుడు, డైపర్లు వేసుకోకుండా నడువలేని వ్యక్తికి టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. దమ్ముంటే పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని రాజీనామా చేయించి తనపై పోటీ చేయించి గెలిపించుకోవాలని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు.'రేవంత్‌రెడ్డి ఆయన తమ్ముళ్లు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నరు. సీఎం తమ్ముడి షెల్ కంపెనీకి రూ.200 కోట్ల ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేసింది నిజం కాదా?' అని సుస్మిత నిలదీశారు. 'ఇప్పుడు నీ తమ్ముడి రూ. 200 కోట్ల ముచ్చటే చెప్పిన.. నా మీద కౌంటర్ ఇయ్యాలని చూస్తే మొత్తం బండారం బయటపెడుతా?' అని హెచ్చరించారు. వేం నరేందర్‌రెడ్డికి సలహాదారుడిగా పదవి కట్టబెడితే మూడేండ్లల్లో ఆయన ఏం సలహా ఇచ్చాడో, ఆ సలహాతో ప్రజలకేం సేవ చేశారో చెప్పాలని రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. వేం నరేందర్‌రెడ్డి ఇచ్చే సలహాలతోనే రాష్ట్రం ఆగమవుతున్నదని విమర్శించారు. వేం నరేందర్‌రెడ్డి సలహాతో మంత్రులు, ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ ఇవ్వట్లేదని, దీంతో కొత్తగా కొత్త ఎమ్మెల్యేలకు రిప్రజెంటేషన్ ఎక్కడ ఇవ్వాలో తెలియడం లేదని మండిపడ్డారు.'సీఎంగా రేవంత్‌రెడ్డి ఉంటాడో? ఊడిపోతడో? అనేది కొంచెం అనుమానంగా ఉన్నది' అని సుస్మిత సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రవర్తనను అధిష్ఠానం అన్నికోణాల్లో జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్టు తమకు సమాచారం ఉన్నదని చెప్పారు. నిజానికి తమ తల్లిదండ్రులు ఉత్తమ్‌కుమారెడ్డి పేరును ప్రతిపాదించాల్సి ఉండెనని, కానీ అన్నీ బాగా చేస్తాడని అప్పుడు అనుకుంటే ఇప్పుడేం చేయడం లేదని తెలిపారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు కావడానికి కష్టపడిన తన తండ్రి కొండా మురళీధర్‌రావు, దయాసాగర్, షబ్బీర్‌అలీ వంటి నేతలను విస్మరించి, ఇప్పుడు వారికి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని తెలిపారు. 'సీల్డ్ కవర్ సీఎం అనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుపెట్టుకోవాలి' అని సూచించారు. 'నిన్ను కూడా కొడంగల్‌లో ఒకసారి ప్రజలు ఓడగొట్టారు. వైఎస్ లాంటివాళ్లే పదేండ్లు సీఎంగా ఉంటానని చెప్పుకోలేదు. అట్లాంటిది నువు పదేండ్లు సీఎంగా ఉంటానని చెప్పుకుంటున్నవ్?' అని విమర్శించారు. 'నువు ఒకసారి ఒక మాట మాట్లాడుతవు? ఇంకోసారి మరో మాట మాట్లాడుతవు' అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని పరకాలలో గెలిపించాలని సీఎం చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు.21 ఏండ్లకే ఎమ్మెల్యే కావాలని ఒకవైపు చెప్తూనే, మరోవైపు డైపర్లు వేసుకొనే వ్యక్తికి, అదికూడా రెండేండ్ల ముందే అభ్యర్థిగా ఎలా ప్రకటిస్తారని నిలదీశారు. సంగారెడ్డికి పోయినప్పుడు జగ్గారెడ్డికి టిక్కెట్‌పై అధిస్థానం చెప్తుందని అంటూనే, పరకాలలో రేవూరికి టికెట్ ఇస్తానని చెప్పటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో అధిష్ఠానం అంటూ ఒకటి ఉంటుందని, టికెట్లు ఇవ్వడం అనేది పార్టీ పెద్దలు చూసుకుంటారనే విషయం




రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకోవాలన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ సభ్యులు ఎవరూ ఆనందంగా లేరని సుస్మిత చెప్పారు. అచ్చ కాంగ్రెస్ వర్సెస్ పచ్చ కాంగ్రెస్‌లా పాలన సాగుతున్నదని విమర్శించారు. అంతా పచ్చకాంగ్రెస్‌దే నడుస్తున్నదని, అచ్చ కాంగ్రెస్‌ది అసలే నడువడం లేదని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. 'టీడీపీ నుంచి వచ్చినవాళ్లంటే ఎందుకు అంత ప్రేమ? మా కాంగ్రెస్ సభ్యులపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నావెందుకు?' అని రేవంత్‌రెడ్డిని నిలదీశారు.సీతాదయాకర్‌కు పదవి ఇస్తానని సీఎం హామీ ఇవ్వడంపై మండిపడ్డారు. 'సీతా దయాకర్‌ది ఎక్కడ? ఎక్కడి కాంగ్రెస్?' అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు కొండా మురళి దగ్గరికి వచ్చి 'మనకు 36 సీట్లు వచ్చినా, 38 సీట్లు ఇచ్చినా మొదట ఎమ్మెల్సీ ఇచ్చేది నీకే అని అన్నవా? లేదా? ప్రమాణం చేసి చెప్పాలి. ఇప్పుడెందుకు మాట మార్చావో, కొండా మురళికి పదవి ఎందుకు ఇవ్వలేదో, రాజకీయంగా ఎందుకు తొక్కదలచుకున్నావో సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. బీసీలను అణచివేయటమే నీ విధానమా? అని ప్రశ్నించారు.'రెండేండ్ల తర్వాత వచ్చే ఎన్నికలకు ఇప్పుడే అభ్యర్థిని ఎట్లా ప్రకటిస్తావ్?' అని సీఎం రేవంత్‌రెడ్డిని సుస్మిత నిలదీశారు. 80 ఏండ్ల వృద్ధుడు, డైపర్లు వేసుకోనిదే నడవలేని ఒక నాయకుడి పేరును పరకాలకు అభ్యర్థిగా ప్రకటించారని మండిపడ్డారు. 'రేవూరికి పరకాల తెలియదు.. పరకాలకు రేవూరి తెలియదు. అటువంటోన్ని అభ్యర్థిగా ప్రకటించి రెచ్చగొట్టావ్' అని సీఎంపై నిప్పులు చెరిగారు. 'రెండేండ్లకు ఎందుకు? దమ్ముంటే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఇప్పుడే రాజీనామా చేయమని చెప్పు. నువ్వు వచ్చి రేవూరికి కాన్వాసింగ్ చెయ్.వంచనగిరిలో నాకు మూడంతస్తుల ఇల్లు ఉన్నది. దాన్ని నీకు ఇచ్చేస్తా.. అక్కడే ఉండి కాన్వాసింగ్ చెయ్. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే కాంగ్రెస్ అభ్యర్థిని, లేదంటే ఇండిపెండెంట్‌గా నిలబడుతా. ఎవరు గెలుస్తరో చూద్దాం' అని రేవంత్‌కు సవాల్ విసిరారు. 'రేవంత్‌రెడ్డీ.. నువ్వుగానీ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి కానీ, వాళ్ల అయ్యగానీ, వాళ్ల తాతగానీ పరకాల నుంచి ఎవరు నిల్చున్నా ఎమ్మెల్యేగా గెలిచేది నేనే' అని ప్రకటిం చారు.'కొండా మురళీ ఇలాఖకు వచ్చి రేవూరిని మళ్లీ గెలిపించమని చెప్పడంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆంతర్యం ఏమిటి?' అని సుస్మిత ప్రశ్నించారు. 'ఎందుకు మాతోని పెట్టుకుంటున్నవ్? ఎందుకు మా జోలికి వస్తున్నవ్?. మాకు ఊడిగం చేయడం రాదు. నువ్వా.. నీ చుట్టూ తిరుగుతూ బ్రోకరిజం చేసే వాళ్లు చేసే పనుల వల్ల ప్రజలకు తప్పుడు సంకేతాలు పోతున్నయ్' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డా? లేక పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డా? అనేది తెలియడం లేదని ఎద్దేవాచేశారు. హైదరాబాద్‌లో ఇండ్ల పంపిణీ సందర్భంగా అక్కడి ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఫొటో పెట్టకుండా ఆయనను అవమానించారని, బీసీలంటే అంత చులకన ఎందుకని ప్రశ్నించారు. 'నీతోపాటు ఉన్న పొంగు ఎక్కువసేపు పొంగదయా.. అది పోతది' అని ఎద్దేవా చేశారు.


### కొండా సుస్మిత వ్యవహారంపై టీపీసీసీ సీరియస్

**హైదరాబాద్, ఆగస్టు19:** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ పీసీసీ అగ్రహం వ్యక్తం చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని నిర్ణయించింది. మరోవైపు కొండ సుస్మితపై క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆమెపై కఠిన చర్యలకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు.పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంకో వైపు ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌ను ఆమె కోరిన విషయం విదితమే.వరంగల్ జిల్లా గీసు



కొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్ల డించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడి యా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలపై పార్టీ సీరియస్ అయింది.

### కొండా సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం: మల్లు రవి



ఢిల్లీ: మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీ యాంశంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండిం చారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని మల్లు రవి స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమా చారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసు కుంటామని వెల్లడించారు.గతంలోనూ షబ్బీర్ అలీ, కొండా మురళీ మధ్య వివాదం తలెత్తినప్పుడు వారితో చర్చించి సమస్యను పరిష్కరించినట్లు మల్లు రవి తెలి పారు. ఇటీవల కాంగ్రెస్ నేత రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ నాయకుల మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించినట్లు మల్లు రవి తెలిపారు.ఈ క్రమంలోనే కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని పీసీసీ చీఫ్‌ను కోరారు. దీంతో సుస్మి తపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
RNI No - APTEL/2022/81596 .. Cell No - 8074124190 ...Printed At ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED,H NO 6-1-303, WARD - 29 ASHOKNAGAR, KARIMNAGAR, TELANGANA -505001. Editor : MANASANI KRISHNA REDDY

# భూముల రీసర్వే పకడ్బందీగా పూర్తి చేయాలి

**ఆయా గ్రామాల వాసులకు సమాచారం ఇవ్వాలి**

**తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**జనోదయ : రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూముల రీసర్వే పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. భూముల రీ సర్వే ప్రక్రియ, వివిధ అంశాలపై తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. జిల్లాలో చేపట్టిన భూముల రీసర్వేలో భాగంగా ఇప్పటి వరకు గంభీరావుపేట మండలం శ్రీనివాసపురం, కోనరావుపేట మండలం లచ్చపేట, వేములవాడ మండలం చంద్రగిరి, చందుర్తి మండలం అనంతపల్లి గ్రామాల్లో చేపట్టిన సర్వే పూర్తయిందని అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రస్తుతం మరో పది గ్రామాల్లో సర్వే మొదలు పెట్టామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ....ఇప్పటికే సర్వే చేసిన గ్రామాలకు సంబంధించిన రికార్డులు ఆయా మండలాల తహసీల్దార్లకు అందజేయాలని ఆదేశించారు. మిగతా గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ వేగవంతం చేసేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళాలని సూచించారు. భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా సేకరించాలని, రోజూ వారీగా లక్ష్యం నిర్దేశించుకుని, రీ సర్వే పూర్తి పారదర్శకతతో చేయాలని సూచించారు. గ్రామాల్లో సర్వే చేసే ముందు జీపీఓలు, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఏ ఏ సర్వే నంబర్ భూముల సమాచారం ముందుగా ఆయా గ్రామాల్లో చేరవేయాలని ఆదేశించారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే, ఇతర పనులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ శాఖల భూముల వివరాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేయాలని తెలిపారు. సర్వే కు సంబంధించిన పూర్తి వివరాలు క్షేత్రస్థాయి, రికార్డులలో పరిశీలించిన తర్వాత మిగతా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్ డి ఓలు శ్రీధర్ బాబు, కెఎస్ బి కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్లు పాల్గొన్నారు.



# న్యూ కాలనీ అభివృద్ధికి అండగా ఉంటాం

**మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్**



**జనోదయ : శేర్లింగంపల్లి:**

మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీవాసులు కాలనీలో గల పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ... త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కాలనీ ప్రజలకు నిత్యజీవితంలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టాల్సిన అవసరం ఉందని, సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం అని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ అభివృద్ధి చెందాలని, ప్రజలు సౌకర్యవంతమైన జీవనం సాగించేలా మౌలిక వసతులను కల్పిస్తామని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ కాలనీవాసులు శంకర్ నాయక్, లావణ్య, కృష్ణ నాయక్ ,సుబ్బరాజు, లక్ష్మయ్య గౌడ్, నారాయణ రాజు, గాల్ రెడ్డి, బి ఎస్ ఎన్ సాయి యాదవ్, శ్రీనివాస్, రమేష్, సురేష్ గౌడ్, దుర్గేష్, జె శంకర్, ప్రవీణ్ రెడ్డి, సురేందర్, నరేష్ నాయక్ పాల్గొన్నారు.

# డెంగ్యూపై వైద్యశాఖ అప్రమత్తం

**- దోమల నివారణకు పైరెత్రం స్ప్రే.. ఇంటింటా డ్రైడే నిర్వహణ**

**జనోదయ : కాటారం**

కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గారెపల్లి, చింతకాని గ్రామాల్లో డెంగ్యూ కేసులు వెలుగుచూడటంతో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సీహెచ్ మధుసూదన్, మలేరియా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ ఆదేశాల మేరకు స్థానిక వైద్యాధికారి డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో జిల్లా ఎపిడమిక్ బృందం బుధవారం గ్రామాల్లో పర్యటించింది. దోమల నివారణకు ఆయా గ్రామాల్లో పైరెత్రం స్ప్రే చేయించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటా డ్రైడే నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పాత టైర్లు, ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలు, ఇతర పనికిరాని సామగ్రిని తొలగించాలని సూచించారు. నీటి గుంతలు ఉంటే పూడ్చివేయాలని, దోమల నివారణకు దోమతెరలు వినియోగించాలని అధికారులు తెలిపారు. జిల్లా సహాయ మలేరియా అధికారి సుధాకర్ మాట్లాడుతూ.. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. పీహెచ్‌సీలో జ్వరానికి సంబంధించిన రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సర్పంచ్ పంతకాని సడవలి, ఉపసర్పంచ్ బానయ్య, చింతకాని సర్పంచ్ రేవెల్లి పద్మసమ్మయ్య, వార్డు సభ్యులు అక్కపాక మల్లయ్య, నిడిగొండ రవి, వేల్పుల శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, సబ్‌యూనిట్ ఆఫీసర్ రమేష్, ఎపిడమిక్ బృందం సభ్యులు కాపర్తి రాజు, తలకోటి పరమేశ్వర్, ఊరుగొండ గోపికృష్ణ, కె. సతీష్, ఆశా కార్యకర్తలు సమ్మక్క, పద్మ, జయప్రద, నాగమణి, రుక్సానా, రమ తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడలో అక్రమ సంబంధంతో పట్టుబడిన జానపద కళాకారులు



**జనోదయ : వేములవాడ**

వేములవాడ అర్బన్‌లోని నంది కమాన్ వద్ద గల ఓ కుల సంఘ భవన్‌లో తీవ్ర కలకలం రేగింది. ప్రముఖ జానపద పాటల కళాకారులుగా పేరుపొందిన ఇద్దరు వ్యక్తులు అక్రమ సంబంధం నడుపుతున్నారనే ఆరోపణలతో రెడ్ హ్యాండెడ్ గా చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న సదరు వ్యక్తి భార్య అక్కడికి చేరుకుని వారిద్దరినీ నిలదీసింది. వివాహేతర సంబంధంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానికుల ఎదుట ఆందోళన చేపట్టింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

# సమాజాభివృద్ధికి, దేశ నిర్మాణానికి పునాది ఇంజనీరింగ్ రంగం

**శాతవాహన విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సతీష్ కుమార్**

**జనోదయ : హుస్నాబాద్ :**




సమాజాభివృద్ధికి, దేశ నిర్మాణానికి పునాది ఇంజనీరింగ్ రంగమని శాతవాహన విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ అన్నారు. విద్యార్థుల కోసం "బ్లూప్రింట్ ఫర్ ది ఫ్యూచర్" అనే అంశంపై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.... ఆధునిక ప్రపంచంలో ఇంజినీరింగ్ అనేది కేవలం సాంకేతిక పరిజ్ఞానానికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజ అభివృద్ధికి మరియు దేశ నిర్మాణానికి పునాదిగా నిలిచే రంగమని పేర్కొన్నారు. భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఇంజినీరింగ్ విద్య ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని వివరించిన ఆయన, విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ జ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు. నూతన ఆలోచనలు, సృజనాత్మకత, ఆవిష్కరణలు ఆధునిక ఇంజినీరింగ్‌లో విజయానికి ప్రధాన ఆధారాలని తెలిపారు. అంతేకాకుండా, వివిధ విభాగాల పరిజ్ఞానాన్ని సమన్వయం చేసుకుంటూ బహుముఖ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం నేటి అవసరమని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, డేటా సైన్స్ వంటి ఆధునిక సాంకేతికతలపై అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమస్యలను విశ్లేషించి సమర్థవంతమైన పరిష్కారాలను అందించే సామర్థ్యం ప్రతి ఇంజినీర్‌లో ఉండాలని పేర్కొన్నారు. మార్కెట్ అవసరాలు, వినియోగదారుల అంచనాలను అర్థం చేసుకొని వాటికి అనుగుణంగా ఆవిష్కరణలు చేయగలగడం ఎంతో ముఖ్యమని వివరించారు. వ్యాపార దృక్పథం, సాంకేతిక పరిజ్ఞానం మరియు సృజనాత్మకత కలయికే ఆధునిక ఇంజినీరింగ్ విజయానికి మార్గమని అన్నారు. వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచం, పెరుగుతున్న పోటీ వంటి సవాళ్లను విద్యార్థులు ధైర్యంగా ఎదుర్కొంటూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తుకు సిద్ధమైన, బాధ్యతాయుతమైన మరియు నూతన ఆలోచనలతో కూడిన ఇంజినీర్లుగా ఎదిగి దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని ప్రోత్సహించారు. చివరిగా, దేశ నిర్మాణంలో మరియు భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

# ఫోన్ పోయిందా.. కంగారు పడకండి

**సీఐ సీతయ్య**




**జనోదయ : రాజేంద్రనగర్**

ప్రజలు తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న లేదా దొంగతనానికి గురైనా కంగారు పడకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో కానీ ఆన్లైన్లో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవాలని అత్తాపూర్ సిఐ ఎ. సీతయ్య తెలిపారు. బుధవారం రెండు లక్షల విలువైన 25 మొబైల్ ఫోన్ లను బాధితులకు అత్తాపూర్ పోలీసులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ... ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్ లో ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేయాలని సూచించారు. దీని ద్వారా ఫోన్లో ఉన్న సమాచారం దుర్వినియోగం కాకుండా ఉంటుందన్నారు. అంతేకాకుండా ఫోన్‌ను ట్రాక్ చేసి రికవరీ చేయడానికి సులభం అవుతుందని చెప్పారు. ఫోన్ బాధితులను పోలీస్ స్టేషన్ కు పిలిపించి తగిన ఆధారాలు సరి చూసుకొని 25 మొబైల్ ఫోన్లను నేరుగా వారికి అందజేశామన్నారు. దొరుకుతాయో లేదో అనుకున్న ఫోన్లు సి ఈ ఐ ఆర్ పోర్టల్ సహాయంతో పోలీసులు రికవరీ చేశారు. ఫోన్లను పొందిన బాధితులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

# డిజిటల్ జర్నలిస్టులకు సమాన హక్కులు కల్పించాలి

**టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కిరణ్**

**సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి : కార్యదర్శి నాగరాజు**

**రాష్ట్ర నూతన కమిటీ ఆవిర్భావం**

**జనోదయ : హనుమకొండ, ఆగస్టు 19:**

డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో సమానంగా హక్కులు, గుర్తింపు, రక్షణ, సంక్షేమం కల్పించాలని తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్(టీడీఎంయు) అధ్యక్షుడు ఆరెల్లి కిరణ్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిజిటల్ మీడియా విస్తరిస్తున్న నేపథ్యంలో జర్నలిస్టుల హక్కులు, బాధ్యతలు, సంక్షేమాన్ని స్పష్టంగా నిర్వచించేలా ప్రత్యేక డిజిటల్ మీడియా పాలసీని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న డిజిటల్ మీడియా ప్రతినిధులను ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు.

**టీడీఎంయూ రాష్ట్ర కార్యవర్గం**

తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ (టీడీఎంయూ)కు సంబంధించిన రిజిస్ట్రేషన్ (రిజిస్ట్రేషన్ నంబర్ 468 ఆఫ్ 2026) ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో సభ్యులు నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అరెల్లి కిరణ్, కార్యదర్శిగా పల్లెబోయిన నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూనియన్ ఉపాధ్యక్షుడిగా కౌడగాని మోహన్‌రావు, కోశాధికారిగా పల్లె వంశీ మోహన్, సహాయ కార్యదర్శిగా బూర నగేష్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా గడ్డం కేశవమూర్తి, గౌరవ సలహాదారుగా రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దాసరి ధనుంజయ, సలేంద్ర రవీందర్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షుడు కిరణ్ గౌడ్ మాట్లాడుతూ డిజిటల్ మీడియా జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేస్తుందని వారు తెలిపారు. డిజిటల్ పేపర్లలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ప్రత్యేక నిబంధనలతో అక్రిడిటేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిజిటల్ జర్నలిస్టులకు ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రెస్‌కాన్ఫరెన్సులు, అధికారిక సమావేశాలు, కలెక్టరేట్లు, పోలీస్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో వార్తా సేకరణకు సమాన అవకాశం కల్పించాలన్నారు. గుర్తింపు కార్డు కేవలం గుర్తింపునకు మాత్రమే కాకుండా విధి నిర్వహణలో రక్షణకు ఉపయోగపడేలా వ్యవస్థ ఉండాలని కోరారు.

**సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి : కార్యదర్శి నాగరాజు**

ప్రభుత్వం అమలు చేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య, సంక్షేమ పథకాలకు అర్హులైన డిజిటల్ జర్నలిస్టులను కూడా చేర్చాలని కార్యదర్శి నాగరాజు కోరారు. ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, అత్యవసర వైద్య సహాయం, విధి నిర్వహణలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం, పిల్లల విద్యకు తోడ్పాటు వంటి సంక్షేమ చర్యలు అందించాలన్నారు. దీర్ఘకాలంగా జర్నలిజంలో కొనసాగుతున్న వారికి వృద్ధాప్య సామాజిక భద్రత, అర్హులైన వారికి గృహ వసతి, ఇళ్ల స్థలాల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.






జనోదయ



# రాష్ట్ర అభివృద్ధికి రహదారులే ముఖ్యం

**-గత పదేళ్లలో రూ.900 కోట్ల రహదారి పనులు.. ప్రస్తుతం రూ.1,700 కోట్ల పనులు మంజూరు**

**- రూ 150 కోట్లతో పెద్దపల్లి బైపాస్ నిర్మాణం**

**- సుల్తానాబాద్ బైపాస్ మంజూరుకు కృషి చేస్తాం**

**- సుల్తానాబాద్ పర్యటనలో రాష్ట్ర మంత్రుల వెల్లడి**

**జనోదయ, పెద్దపల్లి, ఆగస్ట్ 19:**

పెద్దపల్లి నియోజకవర్గం సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల చౌరస్తాతో పాటు మండలంలోని గర్రెపల్లి మరియు స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో కాల్వశ్రీరాంపూర్, ఎలిగేడు, జూలపల్లి మండలాల శిలాఫలకాలు రూ.219 కోట్ల 67 లక్షల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం), నాన్ ప్లాన్ రహదారి అభివృద్ధి పనులకు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ, సింగల్ విండో వారి అధ్వర్యంలో రూ. 32 కోట్ల నిధులతో నిర్మించబోయే నూతన గోదాంలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, సహచర శాసన సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌తో కలిసి ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడిన నెలలోపే పెద్దపల్లి బైపాస్ రహదారికి నిధులు మంజూరు చేశామని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.17 వేల కోట్లతో రహదారి పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత భారీ మొత్తంలో రహదారి పనులు చేపట్టడం లేదన్నారు. హెచ్ఏఎం విధానంలో ప్రభుత్వం 40 శాతం, కాంట్రాక్టర్ 60 శాతం నిధులు భరించే విధంగా పనులు చేపడుతున్నామని, నేడు శంకుస్థాపన చేసిన రహదారి పనులను రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని .



పనులు వారం రోజుల్లోనే క్షేత్రస్థాయిలో ప్రారంభమవుతాయని అన్నారు. గత ప్రభుత్వం సుమారు రూ.40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని అన్నారు. హైదరాబాద్ నుంచి రామగుండం వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై కేంద్ర మంత్రితో చర్చలు జరిపామని, ప్రతిపాదిత రహదారిలో సుల్తానాబాద్ బైపాస్‌ను కూడా మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ...ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలు నిర్మిస్తున్నామని, ఆరోగ్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఇటీవల టీమ్స్ ఆసుపత్రులను ప్రారంభించడంతో పాటు విఫలమైన సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగును విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి మరో 6 వేల ఎకరాల సాగు అవసరమని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్, స్ప్రింక్లర్, రుణమాఫీ వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించిందని అన్నారు.ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ...గత పది సంవత్సరాల్లో పెద్దపల్లి జిల్లాలో కేవలం రూ.900 కోట్ల విలువైన రహదారి పనులు మాత్రమే మంజూరయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 1,700 కోట్ల విలువైన రహదారి పనులు మం జూరయ్యాయని తెలిపారు. కొత్త పోలీస్ స్టేషన్, అవసరమైన ప్రభుత్వ భవనాలు, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని రూ.1,700 కోట్ల రహదారి పనులతో రైతులు, వ్యాపారులు తమ ఉత్పత్తులను వేగంగా రవాణా చేసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. గతంలో మహిళలకు అందించిన పావలా వడ్డీ రుణాల పథకాన్ని విస్మరించారని, ప్రస్తుత ప్రభుత్వం వడ్డీలేని రుణాల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. హైదరాబాద్--రామగుండం గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలో సుల్తానాబాద్ బైపాస్‌ను చేర్చేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...గత రెండు న్నర సంవత్సరాల్లో పెద్దపల్లి అసెంబ్లీ నియోజక వర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రుల సహకారంతో సుమారు రూ.180 కోట్ల విలువైన హెచ్ఏఎం రహదారి పనులకు నేడు శంకుస్థాపన చేశామని అన్నారు.జూలపల్లి మండల కేంద్రంలో రూ.15 కోట్లతో నాలుగు లేన్ల రహ దారి, సెంట్రల్ లైటింగ్ పనులు, కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో రూ.7.35 కోట్లతో నాలుగు లేన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ పనులు, గంగారం, ఉషన్నపల్లి, పందిళ్ళ గ్రామాల్లో రూ.17 కోట్లతో సింగిల్ లేన్ రహదారులను డబుల్ లేన్‌గా విస్తరించే పనులకు శంకుస్థాపన చేశామన్నారు.



# ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరేలా చూడాలి

**జైపూర్ మండల స్థాయి సమీక్షా సమావేశం**

**అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిపై ప్రత్యేక దృష్టి**

**వాస్తవం : జైపూర్ :**

జైపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల స్పెషల్ అధికారి, ఆర్డీఓ గూడూరి శ్రీనివాస్ రావులి, ఎంపీడీఓ శ్రీపతి బాపు రావు,తహసీల్దార్ లివనజా రెడ్డి అధ్యక్షత వహిం చారు. 45 రోజులకు ఒకసారి నిర్వహించే ఈ సమావేశం మండల అభివృద్ధికి నూతన దిశానిర్దేశం చేసింది. కేవలం ఆచార బద్ధమైన ప్రక్రియగా కాకుండా, ప్రతి ప్రభుత్వ శాఖ పని తీరును లోతుగా విశ్లేషించి భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శకాలు ఇచ్చే వేదికగా నిలిచింది. సమా వేశంలో వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాలు వంటి కీలక రంగాలపై ప్రత్యేక చర్చ జరిగింది. రైతులకు అందిన సబ్సిడీలు, పంటల సాగు, విద్యా ప్రమాణాల మెరుగుదల, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను అధికారులు సమర్పించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతపై కూడా దృష్టి సారించారు. సర్పంచ్‌లు తమ గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధి అవసరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరేలా చూడాలని, అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం ముదిగుంట గ్రామ సర్పంచ్ ఆకుల రవికుమార్, పంచాయతీ కార్యదర్శి సురేష్‌లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ



సూపర్ డెంట్ జి. భాగ్యలక్ష్మి, మండలంలోని వివిధ గ్రామ సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 2వ పీఆర్సీలో పంచాయతీ కార్మికులకు గుర్తింపు ఇవ్వాలి

**గంగాధర గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన**



**జనోదయ-గంగాధర ఆగష్టు19:** గంగాధర మండలంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయు గంగాధర మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిపెస్టోలో ప్రకటించిన హామీ మేరకు గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 2వ పీఆర్సీలో పంచాయతీ కార్మికులను గుర్తించి, కనీస వేతనం రూ.26, 000గా నిర్ణయించాలని కోరారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారి న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు

**-కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు**



**జనోదయ : వరంగల్ ప్రతినిధి: ఆగస్టు 19:** రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం వరంగల్ నర్సంపేట రోడ్డులోని శ్రీ కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి సురేఖ పేరుతో అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, పూజలు చేయించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. “మంత్రి కొండా సురేఖ ఆయురారోగ్యాలతో, సుదీర్ఘ కాలం ప్రజా సేవలో ఉండాలని అమ్మవారిని కోరుకున్నామని అన్నారు. వరంగల్ తూర్పు అభివృద్ధికి మంత్రి చేస్తున్న కృషికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించాము. రాష్ట్రంలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించాము” అని అన్నారు. ఈ పూజల్లో పప్పు వేణు, కొప్పుల చంద్రశేఖర్, సర్వర్య సురేష్ కుమార్, జంగం ప్రభాకర్, గూడ శారద, గూడ నవీన్, కొంక వెంకటేశ్వరావు, కొప్పుల శశికాంత్ తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా విశ్వకర్మ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అరుణ్ తేజ చారి

**జనోదయ : సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా విశ్వకర్మ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దురిశెట్టి అరుణ్ తేజ చారిని నియమించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నోండ్ల సంతోష్ చారి ఆధ్వర్యంలో, రాష్ట్ర ఈసీ మెంబర్ కానసల అరుణ్ చారి సమక్షంలో ఈ నియామకం జరిగింది.దుర్శెట్టి అరుణ్ తేజ చారి ఎన్నో సంవత్సరాలుగా సంఘ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సేవలందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ డైరెక్టర్‌గా అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం తెలంగాణ జనరల్ సెక్రటరీగా ఆపదలో ఎవరికీ బ్లడ్ అవసరం ఉన్న ముందుండి ఇప్పియడం కరోనా టైంలో ఆక్సిజన్ అందరికి అందచేసి కూడా



సేవలు అందించారని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ సమాజ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అరుణ్ తేజచారికి పలువురు విశ్వకర్మ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

## ఫోటో అంటే మధుర జ్ఞాపకం



**జనోదయ : ఎల్లారెడ్డిపేట:**

ఫోటో అంటే సజీవ సాక్ష్యం. గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేము. కానీ ఆ కాలంలోని మధుర జ్ఞాపకాలను ఒక ఫోటో రూపంలో భద్రపరుచుకోవచ్చు. భవిష్యత్ తరాలకు అవి తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. అప్పటి పరిస్థితులను ప్రతిబింబించేలా ఫోటోలు తీయడం ఒక మధుర అనుభూతిగా ఉంటుందని ఫోటోగ్రాఫర్లు పేర్కొన్నారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కళా కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వరల్డ్ ఫోటోగ్రఫీ డేను ఘనంగా నిర్వహించారు. మండల కళా కెమెరా క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ అజీముద్దీన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని లాస్య ఫోటో స్టూడియో ఎదుట తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం కార్యదర్శి ముత్యాల ప్రభాకర్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు.అనంతరం సీనియర్ ఫోటోగ్రాఫర్లను ఘనంగా సన్మానించారు.అనంతరం ఎల్లారెడ్డిపేటలోని డే కేర్ సెంటర్‌లో వృద్ధులకు ఫలాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నాయకులు ముత్యాల ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పెంజర్ల తిరుపతి యాదవ్, మండల నాయకులు ఎండీ ఫక్రోద్దీన్, ఎం. కుబేర స్వామి, ఎండీ షాదుల్, ఎన్.శ్రీధర్, చాడ శేఖర్ రెడ్డి, పి.శంకర్, బంటి, హరీష్, రాజు, మరోజు నరసింహాచారి, శివ, శ్రీధర్, రమేష్, చందు చరణ్ పాల్గొన్నారు.